సాక్షి
వికారాబాద్
మంగళవారం । 20 । ఆగస్టు । 2024


అనంతగిరి: వికారాబాద్ సీఐ నాగరాజుకు రాఖీ కడుతున్న అతని సోదరి


తాండూరు రూరల్: సోదరుడు నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రాఖీ కట్టిన ఆయన సోదరీమణులు

అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధం

అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక అయిన రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. సోదరీమణులు వారి సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. నాకు నీవు రక్ష.. నీకు నేను రక్ష అంటూ అక్కాచెల్లెళ్లు పాదాభివందనం చేశారు. చిన్నారులు సైతం ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొంత మంది సుదూర ప్రాంతాలకు వెళ్లి అన్నలకు రాఖీ కట్టారు.


పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డికి, మనోహర్‌రెడ్డికి రాఖీలు కడుతున్న మంత్రి సీతక్క


తాండూరు రూరల్: నారాయణపూర్‌లో అన్నలకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తున్న చిన్నారి


దోమ: బొంపల్లిలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

న్యూస్‌రీల్

నేడు డీకే అరుణ రాక

బొంరాస్‌పేట: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ మంగళవారం మధ్యాహ్నం బొంరాస్‌పేటకు రానున్నట్లు ఆ పార్టీ మండల నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ శ్రావణ్ గౌడ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని తన నివాసంలో జరిగే ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ బలోపేతం తోపాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


అర్జీలు స్వీకరిస్తున్న లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి అర్జీలతోపాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేసి తక్షణం పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై నేరుగా తహసీల్దార్లతో మాట్లాడారు. రుణమాఫీపై వచ్చిన దరఖాస్తులను వ్యవసాయ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు అధికారులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పరిగి: కోల్‌కత్తాలో ట్రెయినీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులను పట్టుకోవడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైద్యులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, రఘురాం, డేవిడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు అక్కాచెల్లెళ్లు


గోల్డ్ మెడల్స్, ట్రోఫీతో ధనశ్రీ, విద్యాశ్రీ

బంట్వారం: అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు మండలంలోని నాగవరం తండాకు చెందిన అక్కాచెల్లెళ్లు ధనశ్రీ పవార్, విద్యాశ్రీ పవార్ ఎంపికయ్యారు. వీరి తల్లిదండ్రులు శంకర్ పవర్, మనీషా ఉద్యోగ రీత్యా మహారాష్ట్రలోని పూణేలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ధనశ్రీ పదోతరగతి,విద్యాశ్రీ ఆరో తరగతి చదువుతున్నారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ఖాన్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి చాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో వీరు బంగారు పతకాలు సాధించారు.

రుణమాఫీ కాని రైతులు ఫిర్యాదు చేయండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



అనంతగిరి: రుణమాఫీ కానీ రైతులు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల సెంటర్‌లు అర్జీలు సమర్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మూడు దశల్లో పంట రుణాలను మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. వివిధ కారణాల వల్ల కొంత మంది అర్హులైన రైతులకు మాఫీ కాలేదన్నారు. అలాంటి వారు మండల కేంద్రాల్లోని ఫిర్యాదుల సెంటర్‌లో తమను సంప్రదిస్తే న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష

- సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్


వికారాబాద్‌లోని ఓ వీధిలో ఫాగింగ్, గడ్డి మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనంతగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ సూచించారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని అంశాలు ఇలా ఉన్నాయి.. దోమల నుంచి వ్యాప్తి చెందే వ్యాధుల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దోమల నుంచి మలేరియా,ఫైలేరియా,డెంగీ,మెదడు వాపు వ్యాధి, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దోమల నివారణ, వ్యాధి లక్షణాలు, వైద్య సేవలపై ఆయన పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

- మలేరియా: చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి చికిత్స చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. లేనిపక్షంలో నెలల తరబడి బాధపడాల్సి వస్తుంది. మలేరియా ఫాల్సిపేరం కేసుల్లో తగు చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారవచ్చు.
- డెంగీ: ఈ వ్యాధి ఎడిస్ దోమ కాటుతో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు

- ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్రమైన జ్వరం వస్తుంది.
- భరించలేనంత తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, వాంతి వచ్చిన అనుభూతి కలగడం వంటి లక్షణాల్లో ఏ రెండు కనిపించినా వెంటనే డెంగీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి.
- దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- ఇంటి పరిసరాలు, ఇంట్లో వాడి పారేసిన వస్తువుల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి.
- కిటికీలు, తలుపుల గుండా ఇంటిలోకి దోమలు వస్తాయి. దోమలు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. వాటి నివారణకు చర్యలు తీసుకుంటూనే రాత్రి వేళ దోమ తెరలు వాడాలి.
- కనీసం వారానికి ఒక్కసారి ఇంట్లోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే పాటించాలి. ఇలా చేయడం వల్ల దోమల పెరుగుదలను అరికట్టవచ్చు.
- ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు పెట్టి ఉంచాలి. లేకుంటే దోమల పెరుగుదలకు ఆవాస కేంద్రాలుగా మారుతాయి.
- మురుగు కాలువల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. మురుగు నీరు సాఫీగా ముందుకు సాగితే దోమల పెరుగుదలకు అవకాశం ఉండదు.
- నిద్రిస్తున్నప్పుడు శరీరాన్ని పూర్తి కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. దోమల నియంత్రణకు మస్కిటో కాయిల్స్ వాడాలి. దోమ తెరలు వాడడం ద్వారా వాటి కాటుకు గురి కాకుండా ఉండొచ్చు.

డెంగీ కేసులు నమోదైతే సమాచారం ఇవ్వండి



డెంగీ నిర్ధారణ కాకున్నా పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేస్తూ రోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. వ్యాధి నిర్ధారణ కాకుండా డెంగీ చికిత్స చేయరాదు. అనుమానం వస్తే రాపిడ్ టెస్ట్ కాకుండా ఎలిసా పరీక్ష విధానం ద్వారా మాత్రమే నిర్ధారణ చేసుకోవాలి. ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ కేసులు నమోదైతే ఆ వివరాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలియజేయాలి. ఎక్కడైన అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే తమ శాఖ వాట్సాప్ నంబర్ 77804 78817కు మెసేజ్ పంపాలి. మా బృందం వెంటనే చర్యలు తీసుకుంటుంది.

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్

మద్యం మత్తులో యువకుల వీరంగం

- పలువురిపై దాడి
- ఆటో ధ్వంసం
- పోలీసులకు ఫిర్యాదు


మందుబాబుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చేరిన మహ్మద్

ధారూరు: మద్యం మత్తులో కొంతమంది యువకులు వీరంగం సృష్టించారు. మందు తాగి పలువురిపై అకారణంగా దాడి చేశారు. ఆపి ఉన్న ఆటోను ధ్వంసం చేశారు. వారి కారును ప్రధాన రోడ్డుకు అడ్డంగా ఉంచి వీఐపీ సైరన్ మోగిస్తూ అటుగా వెళ్లే వాహనాలను అడ్డుకుంటూ అందరిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ సంఘటన ధారూరులోని తాండూరు – వికారాబాద్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు ఎండీ మహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఇన్నోవా కారులో వచ్చి ఎస్‌బీఐ పక్కనే ఉన్న వైన్ షాప్‌లో మద్యం తాగుతూ గొడవకు దిగారు. ఈ తంతూ చూస్తున్న వారిపై దాడికి పాల్పడ్డారు. అక్కడే నిలుచున్న ధారూరుకు చెందిన మహ్మద్‌పై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పక్కనే ఉన్న ఆటోను ధ్వంసం చేశారు. ఎందుకు కొడుతున్నారు అని ప్రశ్నించిన వారిపై కూడా పిడిగుద్దులతో దాడి చేశారు. తర్వాత కారులో ఎక్కి ర్యాష్ డ్రైవింగ్ చేశారు. సైరన్ వేసి నానా హంగామా సృష్టించారు. గాయపడిన మహ్మద్‌ను స్థానికులు వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మాకు భూములివ్వం


కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న నాయకులు, రైతులు

- సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారు
- కలెక్టరేట్ ఎదుట పలు గ్రామాల రైతుల నిరసన

దుద్యాల్: పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీలు దుద్యాల మండలంలో ఏర్పాటు చేయరాదని హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్ల తండా, ఆర్‌బీ తండాలకు చెందిన ఫార్మా భూ బాధిత రైతులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. సోమవారం మాకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు మా భూముల్లో సర్వే చేస్తున్నారని తెలిపారు. తరతరాల నుంచి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న మా భూములను కంపెనీలకు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం పరిహారం ఆశ చూపి రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భూములు ఇవ్వం.. పరిహారం వద్దు అని నినాదాలు చేశారు. స్పందించిన కలెక్టర్ రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వేలు చేయడం సరికాదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాధిత రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాణిక్యం, బసప్ప, శివకుమార్, శ్రీకాంత్, గోవిందు, రాజు నాయక్, సురేశ్ రాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: కర్ణాటక సరిహద్దు.. కొండల మధ్య నెలకొన్న అంబురామేశ్వర ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. గతంలో పురాతన ఆలయాలు ధూప దీప నైవేద్యానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, సీనియర్ నాయకుడు మైపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం, న్యాయవాది గోపాల్ రెడ్డి, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచ్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

అరబిక్ తెలుగు నిఘంటువు ఆవిష్కరణ

దోమ: డాక్టర్ అబ్దుల్ రహీం మహమ్మద్ మౌలానా రచించిన అరబిక్ తెలుగు నిఘంటువును సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సోమవారం నగరంలో ఆవిష్కరించారు. దోమ మండలం దిర్సంపల్లికి చెందిన రచయిత ప్రస్తుతం సౌదీ పౌరుడు. కొన్నేళ్ల క్రితం అక్కడే స్థిరపడ్డ ఆయన 12 ఏళ్ల పాటు కష్టపడి దీన్ని రాశారు. సౌదీ వచ్చిన ఎంతో మంది అరబిక్ మాట్లాడలేక సరైన ఉద్యోగాలు పొందలేక పోవడాన్ని గమనించిన ఆయన ఈ పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో సీఎం చేతుల మీదుగా నిఘంటువును ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు.


నిఘంటువును ఆవిష్కరిస్తున్న సీఎం

క్లుప్తంగా

ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ, పెళ్లి, జైలు!


నిందితుడు నరేష్

కుల్కచర్ల: ఇన్‌స్టాగామ్ పరిచయమైన బాలికతో ప్రేమ వ్యవహారం నడిపిన ఓ యువకుడు చివరకు జైలు పాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌కు చెందిన గుండు మళ్ల సురేశ్(20) డిగ్రీ చదువుతున్నాడు. ఇతనికి ఇన్‌స్టాగామ్‌లో నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన ఓ బాలిక(16)తో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త ప్రేమగా మారడంతో.. గత జూలై 22న ఇద్దరూ ఇళ్ల నుంచి పారిపోయారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నాగర్‌కర్నూల్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం పోక్సో కేసు నమోదైంది. అనంతరం దర్యాప్తు ప్రారంభించిన కుల్కచర్ల పోలీసులు ఇరువురినీ పట్టుకున్నారు. సోమవారం యువకుడిని పరిగి సబ్ జైలులో రిమాండ్ చేయగా, బాలికను వికారాబాద్ సఖి కేంద్రానికి పంపినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాములు(ఫైల్)

కుల్కచర్ల: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇప్పాయిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు(48) సోమవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లాడు. పొలం పక్కన ఉన్న కుంట నుంచి వరి పంటకు మోటారు ద్వారా నీరు పెడుతుండగా ఒక్కసారిగా మోటారు నీటిలోకి పడిపోయింది. దాన్ని తీసేందుకు దిగిన రాములు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కొందుర్గు గురుకుల పాఠశాలలో చదువుతున్న కొడుకు వద్దకు వెళ్లిన రాములు భార్య.. నాన్నతో మాట్లాడిస్తానని ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో ఇంటికి వచ్చారు. అక్కడ రాములు లేకపోవడంతో పొలానికి వెళ్లారు. నీటి కుంటలో విగతజీవిగా పడి ఉండటం చూసి బోరున విలపించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు!


యాచారంలోని ఓ వీధిలో కుక్కలు

యాచారం: మండల కేంద్రంలో సోమవారం వీధి కుక్కలు హంగామా సృష్టించాయి. ఎస్‌బీఐ ఎదురుగా జోవియల్ ఉన్నత పాఠశాల వెనుకాల కాలనీలో రాకపోకలు సాగిస్తున్న వారిని పరుగులు పెట్టించాయి. ఇదే మార్గంలో బైక్‌లపై నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి గ్రామాలకు వెళ్తున్న వారి వెంటపడ్డాయి.

అన్నా.. గుర్తుంచుకో..

హెల్మెట్ లేని, సీటు బెల్ట్ ధరించని వాహనదారులకు రాఖీలు కట్టిన పోలీసులు

నాగోలు: రక్షాబంధన్ సందర్భంగా రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్, కొత్తపేట చౌరస్తాల వద్ద మహిళా కానిస్టేబుళ్ల రాఖీ కట్టించి హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ జగదీష్ మాట్లాడుతూ తోబుట్టువులకు ఎలా అయితే రక్షణ ఇస్తామో.. మన ప్రాణాలను కాపాడే హెల్మెట్, సీట్ బెల్ట్ వాహనదారులు అందరూ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మట్, సీట్ బెల్ట్ మనకు ఎంతో రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ సర్వర్ అహ్మద్ పాల్గొన్నారు.

బైరాగిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

బండ్లగూడ: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బైరాగిగూడలోని సర్వే నెంబర్ 15/3లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఆర్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనంతరం సదరు స్థలంలో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి కూల్చివేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చైర్‌పర్సన్‌పై తిరుగుబావుటా

- పెద్దఅంబర్‌పేటలో మెజార్టీ కౌన్సిలర్ల నిర్ణయం
- అదనపు కలెక్టర్‌కు 17 మంది అవిశ్వాస ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై మెజార్టీ కౌన్సిలర్లు తిరుగుబాటుకు జై కొట్టారు. ఆమెపై అవిశ్వాస నోటీసు ప్రవేశ పెట్టాలని కోరుతూ 17 మంది కౌన్సిలర్లు.. అదనపు కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, పురపాలక సంఘం కమిషనర్లకు సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ప్రస్తుత పాలకవర్గం ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన తర్వాత 2023 జనవరిలో సభ్యులు అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా అప్పటి అవిశ్వాసం అర్ధంతరంగా నిలిచిపోయింది. పీఠంపై గురిపెట్టిన మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్ స్వప్నను గద్దె దింపే యోచనలో భాగంగా అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసును అందజేశారు. ప్రస్తుత చైర్‌పర్సన్‌తోపాటు ఈ పీఠాన్ని ఆశిస్తున్న పండుగుల జయశ్రీ కూడా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండటం గమనార్హం. మొదటి నుంచి కాంగ్రెస్‌ను, మల్‌రెడ్డి సోదరులనే నమ్ముకున్న జయశ్రీకి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పదవిని కట్టబెట్టాలని పార్టీ యోచిస్తోంది. మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులుండగా అందులో 17 మంది కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్నారు.

రాజీనామాకు ససేమిరా

మొదటగా చెవుల స్వప్నను తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయిస్తే మేలని పార్టీ భావించినప్పటికీ అందుకు ఆమె ససేమిరా అనడంతో కౌన్సిలర్లంతా అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఫిర్యాదు చేసిన వారిలో గ్యారల శ్రీనివాస్, వడ్డేపల్లి విద్యావతి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీ, చల్లూరి మురళీధర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్ రెడ్డి, తొండెపు రోహిణి, పాశం అర్చన, మండలి కోటేశ్వరరావు, రమావత్ పరుశురాం, జోర్క గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్, సిద్దంకి కృష్ణారెడ్డి, కందాడ అనుపమ ఉన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో నలుగురు కూడా పరోక్షంగా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ చెవుల స్వప్న చేత ఎలాగైనా రాజీనామా చేయించాలనే బాధ్యతను పురపాలక సంఘానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతకు అప్పగించగా ఆయన మాటలు సైతం వినలేదు. దీంతో కౌన్సిలర్లు అవిశ్వాస బాట పట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆక్రమణలపై ఉక్కుపాదం

- హడలెత్తిస్తున్న హైడ్రా
- ఎప్పుడేమవుతోందనని ప్రముఖుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఏర్పాటు అనంతరం ఇప్పటి వరకు ఎన్నడూ చూడని విధంగా అక్రమ నిర్మాణాలు కుప్పకూలుతుండటంతో పలువురు ప్రముఖులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నేతలతో పాటు కొందరు సినీ ప్రముఖులు, మాజీ ఉన్నతాధికారులకు సైతం ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో భారీ భవంతులుండటంతో తమ భవనాలకు ఎక్కడ ముప్పు వచ్చి పడుతుందోనని వణుకుతున్నట్లు సమాచారం. తమకున్న పరిచయాల ద్వారా రాజకీయ నేతలను సంప్రదించినా, వారు సైతం తామేమీ చేయలేమని, హైడ్రా స్వతంత్రంగా వ్యవహరిస్తోందని చెబుతున్నట్లు తెలుస్తోంది. హైడ్రా దూకుడును తట్టుకోలేని కొందరు రాజకీయ నేతలు ఇప్పటికే దాని తీరుపై తమ వైఖరి వెల్లడించడం తెలిసిందే. ఆదివారం గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఖానాపూర్, చిలుకూరు, అప్పోజీగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు.. తదుపరి కార్యాచరణలో భాగంగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉండే అజీజ్‌నగర్, కొత్వాల్‌గూడ తదితర ప్రాంతాల్లోని భవనాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఏ ఒత్తిళ్లకు లొంగకుండా, హైడ్రా తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. గతంలో ఏదైనా భవనాన్ని కూల్చాలంటే, కూల్చివేత ప్రారంభం కాకముందే పైనుంచి అందే ఫోన్ సమాచారాలతోనే ఆగిపోయేవని ఇప్పుడా పరిస్థితి లేదని చెబుతున్నారు.

అధికారుల్లోనూ ఆందోళన..

అక్రమ నిర్మాణాలకు అనుమతులు.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేసిన జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సహా శివార్లలోని పురపాలికల అధికారులూ ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. నిర్మాణం పూర్తికాకుండానే భవనానికి ఓసీ జారీ కావడాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రస్తావించడంతో అలా ఓసీలు జారీ చేసినవారు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసిన వారు తమ అక్రమాలు ఎక్కడ వెలుగు చూస్తాయోనని ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అందుకు బాధ్యులుగా తమపై కూడా చర్యలుంటాయేమోనని కలవరపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైడ్రా చర్యలతో అవకతవకలకు పాల్పడ్డ అధికారుల్లోనూ చర్చనీయాంశంగా మారింది.మరోవైపు పర్యావరణ పరిరక్షణకు కూడా హైడ్రా తరహా వ్యవస్థ ఉండాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని కోరింది. మొత్తానికి హైడ్రా ఏర్పాటైన అనతికాలంలోనే తన పని తీరుతో ప్రత్యేకతను చాటుకుంటోంది.

గూగుల్ పే బ్లాక్ అయ్యిందని..

- వ్యాపారిని బురిడీ కొట్టించబోయిన సైబర్ నేరగాడు
- తెలిసిన వ్యక్తిలా ఫోన్ కాల్
- రూ.25 వేలు కాజేసేందుకు యత్నం
- గుర్తించిన వ్యాపారి.. పోలీసులకు ఫిర్యాదు


వ్యాపారి సత్యనారాయణ రాఠి

తాండూరు: వ్యాపారిని బురిడీ కొట్టించేందుకు ఓ సైబర్ నేరగాడు ప్రయత్నించాడు. తెలిసిన వ్యక్తిలా ఫోన్ చేసి తన గూగుల్ పే బ్లాక్ అయ్యిందని నీ అకౌంట్‌కు రూ.25 వేలు వేస్తానని నమ్మించాడు. వ్యాపారి సరేనని తన వద్ద పని చేసే వ్యక్తి ఫోన్ నంబర్ ఇచ్చాడు. దానికి సైబర్ నేరగాడు రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు స్క్రీన్ షాట్ పెట్టాడు. అయితే పని చేసే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో డబ్బు కాలేదు. దీంతో వ్యాపారి అప్రమత్తమయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. తాండూరుకు చెందిన సత్యనారాయణ రాఠి పట్టణంలోని భద్రేశ్వర దేవాలయం వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న గుర్తు తెలియని వ్యక్తి సత్యనారాయణకు ఫోన్ చేశాడు. పరిచయం ఉన్న వ్యక్తిగా మాటలు కలిపాడు. తన గూగుల్ పే అకౌంట్ బ్లాక్ అయ్యిందని, తనకు ఒక వ్యక్తి నుంచి రూ.25 వేలు రావాల్సి ఉందని, ఆ డబ్బును నీ అకౌంట్‌లో వేయిస్తానని నమ్మబలికాడు. ఈ వ్యవహారం తేడాగా ఉందని భావించిన వ్యాపారి ముందు నిరాకరించారు. అయితే ఫోన్ చేసిన వ్యక్తి వేడుకోవడంతో ఒప్పుకున్నాడు. వ్యాపారి తన వద్ద పని చేస్తున్న జుబేర్ ఫోన్ నంబర్ ఇచ్చాడు. 5 నిమిషాల వ్యవధిలో జుబేర్ మొబైల్‌కు రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు వాట్సాప్‌లో స్క్రీన్ షాట్ వచ్చింది. కానీ బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ కాలేదు. ఈ విషయాన్ని పని చేసే వ్యక్తి యజమానికి కాల్ చేసి చెప్పాడు. కొత్త వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌లను లిఫ్ట్ చేయవద్దని వ్యాపారి సూచించాడు. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించిన సత్యనారాయణ తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించిన వ్యాపారిని డీఎస్పీ అభినందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఆటో డ్రైవర్ మృతి

హయత్‌నగర్: వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొంగరకలాన్‌కు చెందిన గోపగల్ల జనార్దన్(42) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొహెడలోని ఓ రిసార్టుకు తన ఆటోలో చికెన్ తరలిస్తుండగా.. నారాయణ కళాశాల మలుపు వద్ద వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన జనార్దన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బర్త్‌డే ఈవెంట్ పేరుతో మోసం

నలుగురిపై కేసు నమోదు

చైతన్యపురి: బర్త్‌డే ఈవెంట్ పేరుతో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వె వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముసారంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన దోతుల రాజశేఖర్‌రెడ్డి అనే వ్యాపారి తన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించాడు. ఇందుకు గాను తన దూరపు బంధువు ఈవెంట్ మేనేజర్‌గా పని చేసే సుమంత్‌రెడ్డిని సంప్రదించాడు. అందుకు అంగీకరించిన సుమంత్ రెడ్డి తన భార్య సావిత్రి, తండ్రి విక్రమ్‌రెడ్డి, తల్లి సావిత్రిలను పిలిపించి రాజశేఖర్ రెడ్డి పరిచయం చేశాడు.సినీ హీరోయిన్ సమంత తమకు బాగా తెలుసునని 500 మంది అతిథులతో ఐటీసీ కోహినూర్‌లో గ్రాండ్‌గా ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపాడు. హీరోయిన్‌కు రూ. 30 లక్షలు, ఈవెంట్ నిర్వహణకు రూ.20లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో 2022 అక్టోబర్‌లో రాజశేఖర్‌రెడ్డి అతడికి రూ. 50 లక్షలు అందజేశాడు. అయితే ఆతర్వాత తమ నానమ్మ చనిపోవటంతో ఈవెంట్ రద్దు చేసుకుంటున్నట్లు రాజశేఖర్‌రెడ్డి వారికి సమాచారం అందించాడు. అయితే ఈవెంట్‌కు రూ. 5 లక్షలు, సమంతకు రూ. 10 లక్షలు ఇచ్చామని వారిని తిరిగి అడగలేమని, మిగిలిన రూ. 35 లక్షలు 2022 డిసెంబర్ లోగా తిరిగి ఇస్తామని చెప్పిన సుమంత్ రెడ్డి రూ. 7.35 లక్షల చెక్కు ఇచ్చాడు. అప్పటి నుంచి డబ్బుల తిరిగి ఇవ్వాలని పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఆమనగల్లు: పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అపోలో మెడికల్‌షాప్ ముందు డివైడర్‌పై సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వయసు 55 వరకు ఉంటుందని, ఒంటిపై బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నాడని ఆయన చెప్పారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఆమనగల్లు పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ర్యాష్ డ్రైవింగ్.. ఆటో సీజ్

పట్టణంలో సోమవారం మధ్యాహ్నం రాంగ్‌రూట్‌లో వాహనం నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన పట్టణానికి చెందిన వంశీపై కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై హైవే పెట్రోల్ మొబైల్ ఇన్‌చార్జి, ఏఎస్ఐ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

- జిల్లా రెవెన్యూ అధికారి సంగీత
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా, సత్వ రమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి అభ్యర్థనలను ఆమె స్వీకరించారు. అనంతరం సంగీత మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఏడు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

జ్ఞాపకాలను బంధించి.. వెలుగులు పంచి

ఛాయాచిత్రం.. మానవ బంధాలతో పెనవేసుకున్న అద్భుత సృష్టి. మధుర అనుభవాలను బంధించి తీరిక వేళల్లో మనసుకు ఉల్లాసాన్ని పంచే సాధనం. గత జ్ఞాపకాలను పదిలంగా దాచుకొని భావితరాలకు అందిస్తోంది. అలాంటి సుందర దృశ్యాలకు సృష్టికర్త అయినా లూయిస్ దాగురెను స్మరించుకుంటూ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


ఆమనగల్లు: కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే

ఆమనగల్లు: పట్టణంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద లూయిస్ దాగురె చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం, ఉపాధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి జావేద్, కోశాధికారి వెంకటేశ్‌యాదవ్, సభ్యులు ఎం.ఎ.అలీం, ఖలీం, జబ్బార్, యాదగిరి, నాజర్, శ్రీకాంత్, మహేశ్, రాజు, నర్సింహ, శేఖర్, కఫార్, రఫీ, ప్రవీణ్‌రె డ్డి, గణేశ్, శ్రీశైలం, మహేశ్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీతో స్వయం ఉపాధి

తలకొండపల్లి: మధుర జ్ఞాపకాల్ని పంచడమే కాదు. మనతో లేనివారి స్మృతులను కూడా ఫొటో పంచుతుందని మండల ఫొటోగ్రఫీ గౌరవ అధ్యక్షుడు రవూఫ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ దాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం రవూఫ్ మాట్లాడుతూ.. నేడు ఫొటోగ్రఫీ అనేది స్వయం ఉపాధిగా మారిందని, ఎందరో యువకులు ఫొటోగ్రఫీపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఫొటోగ్రఫీ రంగానికి ఆదరణ పెరిగిందని, అనేక యూనివర్సిటీలు శిక్షణ ఇస్తున్నాయన్నారు. గ్రామీణా ప్రాంతాల్లో పని చేసే ఫొటోగ్రాఫర్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ మండలాధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి మహేశ్, సభ్యులు రమేశ్, విజయ్, శేఖర్, శ్రీను, కిరణ్, చెన్నకేశవులు, తరుణ్, వేణు, గిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో సాంకేతిక పరిజ్ఞానం

చేవెళ్ల: ఫొటో, వీడియో అనేవి జ్ఞాపకాలను గుర్తు చేసేవిగా ఉంటాయని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్, కార్యదర్శి శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫాంహౌస్‌లో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. అనాటి నుంచి నేటి వరకు ఫొటోగ్రఫీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతూ వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

- ఏడాది క్రితం భార్య బలవన్మరణం
- అనాథలైన చిన్నారులు


లాలప్ప మృతదేహం

తాండూరు రూరల్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తాండూరు మండలం అల్లాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్రి లాలప్ప నాపరాతి కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం లాలప్ప భార్య మమత ఉరేసుకొని చనిపోయింది. వీరికి ఇద్దరు పిల్లలు ప్రేమ్‌కుమార్(6), ప్రవళిక(5) ఉన్నారు. ఉదయం లాలప్ప ఇంట్లో పురుగు మందు తాగి పడిపోయాడు. గుర్తించిన కుమారుడు ప్రేమ్‌కుమార్ నాన్నా.. ఏం తాగావు అని ఏడుస్తూ అడిగాడు.. తండ్రి ఏమీ చెప్పక పోవడంతో చుట్టుపక్కల వారికి విషయం తెలిపాడు. స్థానికులు లాలప్పను ఆటోలో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.


అనాథలైన చిన్నారులు ప్రేమ్‌కుమార్, ప్రవళిక

పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మంబాపూర్ వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించారు. ఏడాది క్రితం తల్లి, ఇప్పుడు తండ్రి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు ప్రేమ్‌కుమార్, ప్రవళిక అనాథలయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.


ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటికి రోడ్డెక్కిన జనం

పెద్దేముల్: తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కారు. గంటపాటు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. భగీరథ నీళ్లు రావడం లేదని, కాలనీలోని బోర్లు పాడయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రావన్ పనితీరుపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, నచ్చజెప్పినా వినలేదు. దీంతో మాజీ సర్పంచ్ శ్రావన్‌కుమార్ మెకానిక్‌లను తీసువచ్చి బోర్లకు మరమ్మతులు చేపట్టడంతో శాంతించారు.

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు


ప్రసాద్ (ఫైల్)

అమీర్‌పేట: కారు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌కు చెందిన ప్రసాద్ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బంధువులతో కలిసి మెదక్ చర్చికి వెళ్లిన అతను ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా మైత్రివనం చౌరస్తా సమీపంలో ఎస్‌ఆర్‌నగర్ వైపు నుంచి అమీర్‌పేట వైపు వెళ్తున్న కారు వెనక నుంచి అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సమీపంలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో భావన అనే మహిళ కారు నడుపుతున్నట్లు గుర్తించారు. ఎల్‌బీనగర్ కొత్తపేటకు చెందిన భావన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. హైటెక్ సిటీ నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి తల్లిదండ్రుల ఆందోళన

ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులతో కలిసి ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళకు దిగారు. మృతుడి తండ్రి సాయిలు వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా తల్లి యశోధ ఇళ్లలో పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


రాజబాబు మృతదేహం

తలకొండపల్లి: మద్యం మత్తులో సోదరులతో ఘర్షణ పడి మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భీంరైకార్, అర్జున్ రైక్వార్, రాజబాబు రైక్వార్‌లు అన్నదమ్ములు. వీరు రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చారు. ఖానాపూర్‌లో నివాసం ఉంటూ పలుగు కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల రాజబాబు రైక్వార్(33) తరచూ మద్యానికి బానిసయ్యాడు. అదే క్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం మద్యం తాగొచ్చి అన్నదమ్ములతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో మధ్యలోనే సోదరుడిని వదిలి అన్నదమ్ములు తమ గదిలోకి వెళ్లి నిద్రించారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి.. మీ తమ్ముడు చెట్టుకు ఉరి వేసుకున్నాడని అన్నదమ్ములకు చెప్పాడు. వెంటనే వాళ్లు వెళ్లి చూడగా జామ చెట్టుకు విగతజీవిగా రాజబాబు ఉన్నాడు. తాగిన మత్తులోనే తమ సోదరుడు ఉరి వేసుకొని మృతి చెందాడని అన్నదమ్ములు భావిస్తున్నారు. మృతుడి అన్న భీంరైక్వార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.